# ఆకాశవాణి పరిమళాలు

(అదృష్టవంతుని ఆత్మకథ)



డా॥ ఆర్. అనంత పద్మనాభరావు

విశ్రాంత అదనపు డైరక్టర్ జనరల్, దూరదర్శన్

**ఆకాశవాణి పరిమళాలు**

**(అదృష్టవంతుని ఆత్మకథ)**

**(డా॥ ఆర్. అనంతపద్మనాభరావు)**

ప్రథమ ముద్రణ : 2019 ఉగాది

© రచయితవి

వెల : రూ. 160/-

ప్రతులకు :

**డా॥ ఆర్. అనంతపద్మనాభరావు**

408, సాయికృపా రెసిడెన్సీ

మోతీనగర్, హైదరాబాద్ - 500 114.

సెల్ : 9866586805

E-mail : padmanabharao.revuru@gmail.com

**నవోదయ బుక్ హౌస్,**

కాచిగూడ, హైదరాబాద్.

డి.టి.పి. & ముద్రణ :

**అక్షయ గ్రాఫిక్స్**

చిక్కడపల్లి, హైదరాబాద్.

సెల్: 9989890588

E-mail : rajendratammisetty1@gmail.com

# ఆకాశవాణి పరిమళాలు

ఆకాశవాణి ఉద్యోగంలో నేను చేరడం చిత్రవిచిత్రం. ఇదేదో సినిమా కథ కాదు. నిజం కథ. 1964 నాటి మాట. నేను బి.ఎ. రెండో సంవత్సరం నెల్లూరు వి.ఆర్. కాలేజీలో చదువుతున్నాను. అప్పుడు నా వయస్సు నూనూగు మీసాల 16 దాటి పదిహేడో ఏడు. తెలుగు స్పెషల్ చదవడం వల్ల పద్యం పోకడ, నడక, సొంపు అప్పుడప్పుడే రుచి చూస్తున్నాను.

ఆకాశవాణి విజయవాడ కేంద్రం వారు 'సరసవినోదిని' సమస్యాపూరణం పేర ఒక కార్యక్రమం రాత్రిపూట ప్రసారం చేసేవారు. అందులో ప్రతి వారం ఒక సమస్య ఇచ్చేవారు. దానిని పూరించి 'కార్డు' మీద వ్రాసి విజయవాడకు పోస్టు చెయ్యాలి. అందులో ఎంపిక చేసిన పూరణలు దాదాపు ఓ 20 15 నిమిషాల వ్యవధిలో చదివేవారు. ఆ వారం ఓ సమస్య ఇచ్చారు. నేను వ్రాసుకొని పూరించి పంపాను. సమస్య ఇది - 'కన్యకు నేడు కన్నులట కల్పకవల్లికి కన్నతల్లికిన్'.

కన్యకు నేడు కన్నులని ఒక అర్థం. కన్యకు ఏడు (7) కన్నులని మరో అర్థం. తొలిసారిగా నా పేరు రేడియోలో విని పొంగిపోయాను. పూరణ ఇలా కొనసాగింది. 1964 నవంబర్ 25 రాత్రి ప్రసారమైంది.

అది మొదలు నేను వారం వారం (బుధవాం రేడియోకు అంటుకుపోయి రకరకాల సమస్యలు పూరించాను. ప్రసారమయినాయి. మా తెలుగు అధ్యాపకులు సుప్రసిద్ధ పండితులు శ్రీ పిశుపాటి విశ్వేశ్వరశాస్త్రి గారు. "ఫలనా సమస్య ఇచ్చారు సార్ ఈ వారం" అంటే ఆయన కూడా పూరణలు పంపారు.

అలా అలా ఆకాశవాణి ప్రసారాల పట్ల ఆసక్తి పెరిగింది. ఆ రోజుల్లో ఆకాశవాణి ఒక్కటే ప్రసార మాధ్యమం. నేను కందుకూరు ప్రభుత్వకళాశాలలో 1967 డిసెంబరులో తెలుగు అధ్యాపకుడిగా 20 ఏళ్ళు నిండాయనగా చేరాను. అప్పుడు కూడా రేడియో శ్రోతనే.

అప్పట్లో 'వాణి' అనే పక్షపత్రిక వచ్చేది. అందులో ఆకాశవాణి తెలుగు కేంద్రాలలో ఆ 15 రోజులలో ప్రసారం కాబోయే కార్యక్రమాల వివరాలను ప్రచురించేవారు. ఒకటి,

రెండు ప్రసంగపాఠాలు, ప్రసంగకర్తల ఫోటోలు ప్రచురించేవారు. తొలినాళ్ళలో ఆచంట జానకీరామ్ గారు దాని సంపాదకులు. మదరాసు నుంచి ప్రచురించేవారు. తరువాత రజని గారి చొరవతో విజయవాడకి తరలించారు. వాణి పత్రిక వెల పావలా.

నేను పత్రిక కొని, ముఖ్యమైన కార్యక్రమాలను 'నోట్' చేసుకొని వినేవాడిని. అలా ఆకాశవాణి శ్రోతృవ్యసనం అంటుకుంది. సాహిత్య కార్యక్రమాలు, చర్చలు, నాటకాలు, ధర్మసందేహాలు, బావగారి కబుర్లు విని ఆనందించేవాడిని. నాటకాల ప్రసారంలో విజయవాడ పేరు సంపాదించింది. నండూరి సుబ్బారావు, సి. రామమోహనరావు అక్కడ నాటక విభాగంలో 'డ్రామా వాయిస్'లు.

1972లో ననుకొంటా! నా సమస్యా పూరణ 'వాణి'లో ప్రచురితమైంది. అది నా తొలి ప్రచురణ. అదే సంవత్సరం చివరలో వాణిలో ఒక ప్రకటన వెలువడింది. తెలుగులో 'సీనియర్ స్క్రిప్ట్ రైటర్' ఉద్యోగానికి దరఖాస్తులు పంపుకోవచ్చునని సారాంశం. విజయవాడలో ఖాళీ. నేను మా ఆఫీసు ద్వారా అప్లికేషన్ విజయవాడ స్టేషన్ డైరక్టర్ గారికి పంపాను.

రెండు మూడు నెలల్లో ఇంటర్వ్యూ పిలుపు వచ్చింది. అప్పుడు కాలేజీలో నా బేసిక్ జీతం 250 రూపాయలు. డి.ఎ., హెచ్.ఆర్.ఎ. అదనం. ఆకాశవాణికి ఉద్యోగానికీ అదే జీతం. రేడియో మీద మోజుతో అప్లయి చేశాను. మరో నాలుగు రోజుల్లో ఇంటర్వ్యూ.

ఓ సాయంకాలం కందుకూరు జనార్ధనస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు హరికథ చెప్పడానికి ఆకాశవాణి విజయవాడ కేంద్రం వయోలిన్ విద్వాంసులు శ్రీ నల్లాన్ చక్రవర్తుల కృష్ణమాచార్యులవారు వచ్చారు. సహాధ్యాపకులు ఆర్.ఎస్. సుదర్శనాచార్యుల వారి ఇంట్లో ఆ రాత్రికి వారు బస చేశారు. నేను వారిని కలిసి నా ఇంటర్వ్యూ లెటర్ చూపాను. ఆయన నవ్వారు. నాకర్థం కాలేదు. "ఇంటర్వ్యూకి వెళ్ళడం మంచిదే. కాని ఆ ఉద్యోగం మా ఆఫీసులో క్రిందిస్థాయిలో జూనియర్ స్క్రిప్ట్ రైటర్కి ప్రమోషన్ కింద ఇస్తారని విన్నాను. మీ యిష్టం" అన్నారు. విజయవాడ వెళ్ళడం మానేశాను.

మా కళాశాల తెలుగు శాఖాధ్యక్షులు జంధ్యాల లక్ష్మీ నారాయణ శాస్త్రి ప్రోత్సాహంతో నేను 1969లో అష్టావధానం చేయడానికి ఆకాశవాణి సరసవినోదిని పరోక్ష కారణం. విజయవాడ కేంద్రం నుంచి ఏదైనా సాహిత్య ప్రసంగం చేయాలని

ఆలోచన వచ్చింది. ఒకటి, రెండు ప్రసంగాలు వ్రాసి పంపితే త్రిప్పి పంపారు. నేను పి.హెచ్.డి. కోసం కందుకూరి రుద్రకవి రచనలు ఎంచుకుని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆచార్య జాస్తి సూర్యనారాయణ పర్యవేక్షకులుగా పరిశోధన 1973లో మొదలుపెట్టాను.

'రుద్రకవి రచనలు' అనే అంశంపై ఆరు పేజీల ప్రసంగపాఠం విజయవాడ కేంద్రానికి పంపాను. శంకరమంచి సత్యం ఆ రోజుల్లో ప్రసంగశాఖని నిర్వహించేవారు. 'సాహిత్యమంజరి' అనే ఓ సాహిత్య కార్యక్రమంలో నా ప్రసంగాన్ని షెడ్యూల్ చేశారు.

1974 మేలో రికార్డింగ్‌కు రమ్మని ఆకాశవాణి కేంద్రం నుంచి నాకు ఆహ్వానం వచ్చింది. నేను విజయవాడకెళ్ళి మిత్రులు జంధ్యాల మహతీ శంకర్ (సత్యనారాయణపురం) ఇంట్లో దిగాను. వారే నన్ను రేడియో స్టేషన్‌కు తీసుకెళ్ళారు. ఆ రోజు బుద్ధపూర్ణిమ. కేంద్రకార్యాలయాలకు సెలవు. స్టూడియోలో కొప్పుల సుబ్బారావు అనౌన్సర్ రికార్డింగ్ కోసం ఎదురుచూస్తున్నారు.

స్టూడియోలో మైక్ ముందు కూచోబెట్టారు. 'నాలుగు వాక్యాలు చదవండి' అన్నారు. ఆ తర్వాత 'ఓ.కె. మొదలుపెట్టండి' అన్నారు. అలా నా ఆకాశవాణి అరంగ్రేటం ఆనాడు మొదలైంది. కొప్పుల సుబ్బారావు తర్వాత న్యూస్ రీడర్‌గా చేరి మంచి పేరు సంపాదించారు. ఇటీవలే మరణించారు.

ఆఫీసుకు సెలవు కావడం వల్ల శంకరమంచి సత్యం గారిని కలవలేకపోయాను. అయితే తర్వాత కొద్ది నెలల్లో ఆయన మా కళాశాల సభలో మాట్లాడడానికి వచ్చినప్పుడు కలిశాను. కంచుకంఠం. ఆయన వ్రాసిన 'హరహర మహాదేవ' నాటకం విజయవాడ కేంద్రంలో తయారై రాష్ట్రవ్యాప్తంగా అన్ని కేంద్రాలు ప్రసారం చేశాయి. కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి ఆయన వ్రాసిన అమరావతి కథల సంపుటికి లభించింది. ఆయన వంశపారంపర్యంగా అమరలింగేశ్వరాలయం పూజారి కుటుంబానికి చెందినవారు. లా పట్టా పొంది ఆకాశవాణిలో ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌గా 60వ దశకంలో చేరారు. స్టేషన్ డైరక్టర్‌గా పదోన్నతి పొంది విదేశీ ప్రసారాల విభాగం ఢిల్లీలో పనిచేస్తూ అకాల మరణం పొందారు. ఆయన వ్రాసిన అమరావతి కథలు దూరదర్శన్ జాతీయ ప్రసారాలలో సీరియల్‌గా ప్రసారమయ్యే కార్యక్రమ ఎంపికలో నేనూ భాగస్వామిని.

ఒక ప్రసంగం ప్రసారం కాగానే మరికొద్ది నెలలలో యువవాణికి మరో ప్రసంగ పాఠం పంపాను. నేను కాలేజీ సెలవల్లో 'గోవా' పర్యటించి వచ్చాను. ఆ యాత్రావిశేషాలు తెలుపుతూ – 'యాత్రాస్థలంగా గోవా' అనే ప్రసంగం పంపాను. రెండో నెలలోనే నాకు రికార్డింగ్ లెటర్ వచ్చింది. దానికి మూల కారణం – యువవాణి విభాగకార్యక్రమ నిర్వహణాధికారి శ్రీ గోపాల్. ఆయన గోవా ఆకాశవాణిలో పనిచేసి విజయవాడకి బదిలీ అయి వచ్చారు. ఆ విధంగా అయనకు గోవా అంటే ఇష్టం. నా రికార్డింగ్ తేదీకి నేను రేడియో స్టేషన్ కెళ్ళాను. సాయంకాలం 6 గంటల 30 నిమిషాలకు 'లైవ్' ప్రోగ్రాం. యథాతథంగా ప్రసారం. నాకూ భయం భయంగా వుంది. స్టూడియో గదిలోనుండి బయటకి రాగానే 'బాగా చదివారు' అన్నారు శ్రీ గోపాల్. అలా అందరినీ మెచ్చుకోవడం ఆకాశవాణి సిబ్బందికి అలవాటని తర్వాత తర్వాత తెలిసి వచ్చింది.

శ్రీ గోపాల్ గారి పరిచయాన్ని పురస్కరించుకొని 'యువవాణి'లో నేను స్థాపించిన కందుకూరు 'రచయితల సంఘం' ఆధ్వర్యంలో 30 నిమిషాల కదంబ కార్యక్రమానికి సరిపడే రచనలు పంపాను. ఆయన ఆమోదముద్ర వేసి రికార్డింగ్ కోసం కందుకూరికి కొప్పుల సుబ్బారావు బృందాన్ని 1975 ఆగస్టునెలలో పంపారు. మిత్రులు బి.వి.వి. హెచ్.బి. ప్రసాదరావు, కరణం సుబ్బారావు, నేను, గుడి నారాయణబాబు మరికొందరం అందులో పాల్గొని రికార్డింగ్ చేశాం. తర్వాతి వారం అది ప్రసారమైంది. ఆ విధంగా రేడియోలో నేను చేరకముందే మూడు ప్రోగ్రాంలు చేశాను.

ఇక్కడే ఉంది మలుపు. 1974 ఏప్రిల్‌లో 'వాణి'లో "ప్రొడ్యూసర్ స్పోకెన్ వర్డ్" అనే ఉద్యోగ ప్రకటన చూశాను. రేడియోలో ప్రవేశించాలనే తహతహ వుంది. 'Through Proper Channel' అంటారు. మా కళాశాలకు హైదరాబాదులోని డైరక్టర్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అధిపతి. వారి కార్యాలయం ద్వారా నా అప్లికేషన్ ఆకాశవాణి హైదరాబాద్ కేంద్ర డైరక్టరుకు నిర్ణీత గడువులోపే చేరింది.

1974 పూర్తి అయింది. అప్లికేషన్ పంపి సంవత్సరం పూర్తి అయింది. ఆకాశవాణి వాళ్ళు ఆ విషయం మరిచిపోయారనుకుంటున్న తరుణంలో 1975 జూన్ నెలలో హైదరాబాద్ కేంద్రం నుండి ఓ ఇంటర్వ్యూ కాల్ లెటర్ వచ్చింది. జూలై 1 న హైదరాబాదు ఆకాశవాణి డైరక్టర్ కార్యాలయంలో నా విద్యార్హతల సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూకి హాజరు కమ్మని తాఖీదు. ఔరా! మరచిపోయారనుకొన్న విషయం ఇలా పరిణమించింది.

ఆకాశవాణిలో ప్రవచనశాఖ ప్రయోక్త (ప్రొడ్యూసర్ స్పోకెన్ వర్డ్) ఉద్యోగానికి ఇంటర్వ్యూ పిలుపునందుకొని హైదరాబాదు చేరుకొన్నాను. హైదరాబాదు లోగడ వచ్చినప్పుడు – కందుకూరు ప్రభుత్వ కళాశాల అధ్యాపకుడిగా – ఆకాశవాణిలో పనిచేస్తున్న అసిస్టెంట్ స్టేషన్ డైరెక్టరు గుంటూరు రఘురాం గారిని కలిసి ఉన్నాను. ఆయన యువవాణి కార్యక్రమాలు పర్యవేక్షిస్తుండేవారు. "మీరు రేపు అవధాన ప్రక్రియ గూర్చి ఒక ప్రసంగం 15 నిముషాలకు తయారు చేసుకుని రండి!" అన్నారు. మర్నాడు స్టూడియోలో రికార్డు చేశారు. అందువల్ల నాకు ఆ ప్రాంగణం చిరపరిచితమే.

ఇంటర్వ్యూ కెళ్ళేముందు నేను నెల్లూరు ఏదో పని మీద వెళ్ళాను. అంతకు ముందు నెలలో నేను నెల్లూరు వేద సంస్కృత కళాశాలలో ఒక అష్టావధానం చేశాను. ఆ సభ ప్రారంభమైన కొద్ది నిముషాలలో డా. బెజవాడ గోపాలరెడ్డిగారు, విశ్రాంత గవర్నరు విచ్చేశారు. సభలో కోలాహలం. ఆయనను వేదిక మీదకి రమ్మని ప్రిన్సిపాల్ ఉడాలి సుబ్బరామశాస్త్రి మర్యాదపూర్వకంగా మైక్‌లో ఆహ్వానించారు. నేను క్రింది వరుసలో కూచొని పది నిముషాలలో వెళ్ళిపోతానని ఆయన మొదటి వరుసలో కూచొన్నారు.

నేను ఆశువుగా గోపాలరెడ్డి మీద ఓ పద్యం అల్లాను.

సభాసదులు చప్పట్లు చరిచారు. గోపాలరెడ్డి మందస్మితం చేశారు. అవధానం బాగా రక్తి కట్టింది. 10 నిముషాలు వుండాలనుకొన్న ఆయన రెండు గంటలు సొంతంగా కూచొని అవధానంతరం వేదిక పైకి వచ్చి నన్ను శాలువాతో సత్కరించారు.

ఆ పరిచయాన్ని పురస్కరించుకొని వారిని ఇంటి వద్ద – సుదర్శన మహల్‌లో అంతకు ముందు కలిసి వున్నాను. ప్రాచీన పద్యాలు నాలుగు చెప్పమని అడిగి నా చేత చెప్పించుకొని ఆనందించారు. ఆ చనువుతో నేను ఇంటర్వ్యూకు ముందు వారిని కలిసి హైదరాబాదు వెళ్తున్నానన్నాను. ఆయన నా మనసు కనిపెట్టారు.

"నేను ఎవరికీ సిఫారసు చేయను. వాళ్ళు నా మాట గౌరవించరనుకో, ఏం బాగుంటుంది? నా జీవితంలో ఎవరికీ సిఫారసు లెటర్లు ఇవ్వలేదు. ఇవ్వను" అని ఆయన సిఫారసు లెటర్ మీద తాను వ్రాసిన వచన కవిత వినిపించారు.

"నా అవధానం పూర్తిగా మీరు చూశారు. ఆస్వాదించారు. ఆ మాట మీ స్వదస్తూరితో వ్రాసి ఇవ్వండి" అన్నాను.

"నిరభ్యంతరంగా" అంటూ ఆయన లెటర్‌హెడ్ మీద స్వయంగా నాలుగు వాక్యాలు వ్రాశారు. "అనంతపద్మనాభరావు చక్కటి అవధాని. వందల కొద్ది ప్రాచీన పద్యాలు కంఠతా వచ్చు" అని వ్రాసి సంతకం చేసి ఇచ్చారు.

ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంలో అప్పటి స్టేషన్ డైరక్టరు పసల గురుమూర్తి. ఆయన కార్యాలయం ముందు వేసిన కుర్చీలలో స్వయంవర రాకుమారులవలె 30 మంది కూచుని ఉన్నారు. ఆకాశవాణి వివిధకేంద్రాలలో పనిచేస్తున్న అభ్యర్థులు పదిమందికి పైగా ఉన్నారని తర్వాత తెలిసింది. నాకు పరిచయమైన వ్యక్తి ఒకే ఒక్క ఉషశ్రీ. ఆయన విజయవాడ కేంద్రంలో అప్పటికే సీనియర్ స్క్రిప్ట్ రైటర్‌గా పని చేస్తున్నారు.

1974లో ప్రకటన చేసే సమయానికి ఒకే ఒక్క ప్రొడ్యూసర్ పదవి విజయవాడలో ఖాళీ వుంది. ప్రకటన వెలువడ్డ కొద్దినెలల్లో రావురి భరధ్వాజగారిని హైదరాబాద్ కేంద్రంలో ప్రొడ్యూసర్‌గా వేస్తున్నట్లు ఢిల్లీ నుండి ఆదేశాలు వచ్చాయి. 1975 జూన్‌లో ఆయన హైదరాబాదులో చేరారు. అదే నెలలో కడప, విశాఖపట్టణం కేంద్రాలు పూర్తిస్థాయి ప్రసారాలు త్రిసంధ్యలలో మెదలెట్టాయి. ఆ రెండింటికీ ప్రొడ్యూసర్ పోస్టులు శాంక్షన్ అయ్యాయి. మొత్తం మూడు ఖాళీలకు ముప్పయి ఐదు మంది అభ్యర్థులం.

ఆకాశవాణిలో పనిచేసిన అనుభవం లేనివారు నా వంటి నలుగురైదుగురు ఉన్నారు. ఇంటర్వ్యూ ఉదయం 11 గంటలకు ప్రారంభమైంది. భోజన విరామానంతరం మూడింటికి నా వంతు వచ్చింది. ఉదయం వరుసలో ఉషశ్రీని లాంఛనంగా ఇంటర్వ్యూ చేశారు. ఆయన ఆ పదవికి నూరు శాతం అర్హులు. ఆయన సెలెక్షన్ నిశ్చితం. ఇక మిగిలింది రెండే పోస్టులు. కడప, విశాఖపట్టణం.

ఇంటర్వ్యూ బోర్డులో స్టేషన్ డైరక్టర్ చైర్మన్. ఆయనతో బాటు మరో ముగ్గురు మెంబర్లు. డైరక్టర్ జనరల్ ప్రతినిధిగా విజయవాడ కేంద్ర డైరక్టరు బాలాంత్రపు రజనీకాంతరావు వచ్చారు. సుప్రసిద్ధ సాహితీవేత్త ఆచార్య బిరుదురాజు రామరాజు వచ్చారు. మూడో వ్యక్తి ఎవరో నాకిప్పటికీ తెలియదు. నన్ను 30 నిముషాలకి పైగా ప్రశ్నలడిగారు.

నేను హుషారుగానే సమాధానాలిచ్చాను. నాకు ఎం.ఏ.లో వచ్చిన గోల్డ్ మెడలు, నా సర్టిఫికెట్లు, గోపాలరెడ్డి గారు యిచ్చిన టెస్టిమోనియల్, నేను అప్పటికే ప్రచురించిన 'వి.వి.గిరి.జీవిత చరిత్ర', 'మారని నాణెం' నవల చూపించాను.

రామరాజు గారు "మీరు కందుకూరి రుద్రకవి మీద పి.హెచ్.డి.కి పరిశోధన చేస్తున్నారు గదా, జనార్దనాష్టకంలో ఒక పద్యం చెప్పండి" అన్నారు.

నేను సంతోషంగా రాగయుక్తంగా ఒక పద్యం చదివాను. అందరి ముఖాలలో హర్షం కనిపించింది.

రజనీకాంతరావు గారు, "అవధానం చేశామంటున్నారు, హైదరాబాద్ నగరంపై ఆశువుగా ఒక పద్యం చెప్పండి" అన్నారు. రెండు నిముషాలు ఆలోచించి చార్మినార్ ప్రాశస్త్యంపై పద్యం చెప్పాను. అప్పటికే అరగంట పూర్తి అయింది.

స్టేషన్ డైరక్టర్ బాలగురుమూర్తిగారు నాకు కొన్ని హెచ్చరికలు చేశారు – "చూడండి! ఈ ఉద్యోగం కాంట్రాక్టు పద్ధతిపై ఏడాది కొకసారి పొడిగిస్తారు. పెన్షన్ లేదు. మీరు ఇప్పుడు రూ. 355 బేసిక్‌లో ఉన్నారు. దీని బేసిక్ రూ. 350/– పైపెచ్చు మీరు కాలేజీలో ప్రిన్సిపాల్ పోస్టు వరకు ఎదగవచ్చు. మీరు గవర్నమెంట్ ఉద్యోగం 'రిజైన్' చేసి రావాలి. ఆలోచించుకోండి. మీరు తొందరపడి ఒక నిర్ణయానికి రావద్దు. పెద్దవాడిగా సలహా ఇస్తున్నాను" అన్నారు సున్నితంగా.

"సార్! నాకు రేడియోలో పని చేయాలని ఎప్పటినుంచో కోరిక. ఈ అవకాశం వచ్చింది. నేను స్టేషన్ డైరక్టర్ అవుతాను సార్!" అన్నాను వినమ్రంగా. రజనిగారు ముసి ముసి నవ్వులు నవ్వారు.

తర్వాత ఓ సంవత్సరానికి వారిని ఢిల్లీలో కలిసినప్పుడన్నారు "You Are A Born Prodigy". నేనంటే వారికి వాత్సల్యం. చివరగా స్టేషన్ డైరక్టర్ అడిగారు

"ఒక వేళ సెలెక్ట్ అయితే రిజైన్ చేసి రావడానికి ఎంత టైం పడుతుంది?" అని. నెల రోజుల్లో చేరిపోతానన్నాను.

ఆగస్టు మొదటివారంలోనే నాకు ఆర్డర్లు వచ్చాయి. పోలీస్ వెరిఫికేషన్ అప్పటికే పూర్తి అయింది. ఉషశ్రీని విజయవాడ, నన్ను కడప, విజయభూషణ శర్మను విశాఖపట్టణం వేస్తూ ఆర్డర్లు వచ్చాయి. వాళ్ళిద్దరూ రేడియోలో అప్పటికే విజయవాడ, విశాఖలలో పనిచేస్తున్నారు. వెంటనే చేరిపోయారు.

నేను రాజీనామా ఆమోదం కోసం హైదరాబాద్ లోని డైరక్టర్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఆఫీసుకు కందుకూరు నుండి పరుగులు తీశాను. సంబంధిత గుమాస్తాకు మా కళాశాల ప్రిన్సిపాల్ వ్రాసిన ఆమోదముద్ర లెటర్ చూపించాను. “ఆగస్టు 15లోగా చేరాలి సార్!” అన్నాను. ఆయన ఓ నవ్వు నవ్వాడు.

“రాజీనామా ఆమోదించడానికి కనీసం ఓ నెల పడుతుంది. ఫైలును జాయింట్ డైరక్టర్‌కు పంపాలి. ఆయన దగ్గర నుండి డైరక్టర్‌కు వెళుతుంది. ఆయన సంతకమై వస్తుంది. మళ్ళీ ఆర్డర్ తయారు చేయాలి” ఇలా ఒక ఉపన్యాసం ఇచ్చారు.

మా కళాశాల మిత్రులు కొందరు నాకు హితబోధ చేశారు. ‘ఓ వంద రూపాయలు గుమాస్తా చేతిలో పెట్టండి. పని సులువవుతుంది’ అని. లంచం ఇవ్వడం ఎలానో తెలియని అర్భకుణ్ణి. తీసుకోవడం అనే ప్రశ్న ఉదయించలేదనుకోండి. ఆయన ఫైళ్ళు చూస్తున్నప్పుడు ఆయన టేబుల్‌పై వున్న ఒక పెద్ద లెడ్జరులో 50 రూపాయల నోటు దోపాను. ఆయన అటుకేసి చూడలేదు. బహుశా ఆ ఫైలు డైరక్టరు దగ్గరకు వెళ్ళేదేమోనని నా భయం. పది నిముషాల తర్వాత్త సైగల ద్వారా విషయం బయటపెట్టాను.

“ఇక్కడటండీ ఇచ్చేది” అన్నాడు గొణుగుతూ.

“ద్వారకా హోటల్లో కాఫీ తాగి వద్దాం రండి సార్! బాగా అలసిపోయారు” అన్నాను.

“మీరు నడవండి. పది నిముషాల్లో వస్తాను” అన్నారు.

మాట మీద నిలబడే వ్యక్తి ఆయన. సాయంకాలం 5 గంటలలోపు ఆయనే స్వయంగా డైరక్టరు వద్దకు వెళ్ళి నా రాజీనామా ఆమోదముద్ర వేయించి ఆ కాగితం నా చేతిలో పెట్టారు. నేను మర్నాడు కందుకూరు చేరాను విజయగర్వంతో.

ఆకాశవాణిలో చేరడానికి కృత్యావ్యవస్థ మొదలైంది. కందుకూరులో 1967 డిసెంబరులో చేరిన నాటి నుండి 1975 ఆగస్టు వరకు ఎన్నో జ్ఞాపకాలు. మిత్రులు, విద్యార్థుల అప్యాయత. అధ్యాపకుల అనురాగం పెనవేసుకొన్న రోజులు.

నేను అవధానిగా గజ్జె కట్టినది కందుకూరు. మా వివాహం జరిగినది 1969 మే 8. మాకు ముగ్గురు పిల్లలు కలిగిన ఊరి అనుబంధం. అన్నీ ముప్పిరిగొని వీరందరినీ వదిలి వెళ్తున్నాననే బాధ. కందుకూరు తాలూకా రచయితల సంఘం పేర ఒక సంస్థను స్థాపించి నేను అధ్యక్షుడిగా ఐదేళ్ళు ఎన్నో సాహిత్య కార్యక్రమాలు చేశాం. విద్యార్థులను ప్రోత్సహించడానికి కవితా సంకలనాలు తెచ్చాను.

కందుకూరు రచయితల సహకారసంఘం స్థాపించి పుస్తకాలు వేశాం. పవని నిర్మల ప్రభావతి దంపతులు, విక్రాల శేషాచార్యదంపతులు, కొమాండూరి రామానుజాచార్యులు, బి.వి.వి.హెచ్.బి. ప్రసాదరావు, కరణం సుబ్బారావు వంటి కవిమిత్రులతో ఎర్రన జయంతి, రుద్రకవి జయంతి, పిల్లలమర్రి పినవీరభద్ర జయంతులు నిర్వహించాం. గుడి నారాయణబాబు, అలంకారం కోటంరాజు అనే ఇద్దరు శిష్యులు నా వద్ద కవిత్వం నేర్చుకుని పద్యాల శంఖం పూరించారు. వీరంతా కలిసి ఆగస్టు 13 న నా వీడ్కోలు సభ పెద్ద ఎత్తున సంకల్పించారు.

ఇంతలో ఒక రోజు ఒక ఆకాశరామన్న ఉత్తరం వచ్చింది.

“ఒరే! లం.... కొడకా! కడప సంగతి నీకు తెలియదు. నీవు వచ్చావంటే నీ అంతు చూస్తాం – ఇట్లు నీ శ్రేయోభిలాషి.”

నా బాగోగులు కోరిన ఆ మిత్రుడెవరో గాదు, ఆకాశవాణిలో 20 ఏళ్ళుగా పనిచేస్తూ, ఇంటర్వ్యూకు నాతో పాటు వచ్చిన ఒక ఉద్యోగ మిత్రుడని తర్వాత పసిగట్టాను.

ఆగస్టు 14న కళాశాల అధ్యాపకత్వానికి ‘నమస్కారం’ పెట్టి తెల్లవారేసరికి కడప చేరుకున్నాను. ఆగస్టు 15న ఆకాశవాణిలో చేరడానికి కోపరేటివ్ కాలనీలోని ఆఫీసుకెళ్ళాను. అకౌంటెంట్ జి.యస్.ఆర్. కృష్ణయ్య ఒక మడత పేచీ పెట్టారు. “ఆగస్టు 15 పబ్లిక్ హాలిడే. మీరు కొత్త ఉద్యోగంలో చేరడానికి లేదు – రేపు చేరండి” – అన్నాడు. అంటే నేను ఆగస్టు 14న కాలేజీలో, 15 న air లో (గాలిలో), 16న AIRలో ఉన్నాను. ఆ ఒక్కరోజు break-in-service తర్వాత 10 ఏళ్ళకు ratify చేస్తూ డైరక్టర్ జనరల్ ఆమోద ముద్ర వేశారు. మొదట్లో ఒక పది రోజుల కాంట్రాక్టు ఇచ్చారు. పోలీస్ వెరిఫికేషన్ అయిన తర్వాత మూడు సంవత్సరాల కాంట్రాక్టు ఇచ్చారు. అలా నా రంగ ప్రవేశం జరిగింది.

## కడప గడపలో...

1975 ఆగస్టు 16 ఆకాశవాణిలో నా అరంగ్రేటం జరిగిన రోజు. కడప ఆకాశవాణి రిలే కేంద్రాన్ని 1963 జూన్‌లో అప్పటి కేంద్ర సమాచార ప్రసారశాఖల మంత్రి డా. బెజవాడ గోపాలరెడ్డి ప్రారంభించారు. అదే నెలలో విశాఖపట్టణం కేంద్రం కూడా వారే ఆరంభించారు. హైదరాబాదు నుండి సాయంకాలం ప్రసారాలను కడప కేంద్రము, విజయవాడ నుండి విశాఖపట్టణం కేంద్రము రిలే చేసేవి. 1975 జూన్‌లో అంటే ఓ పుష్కర కాలం తర్వాత రెండు కేంద్రాలు మూడుపూటల ప్రసారాలతో స్వయంప్రతిపత్తి గల కేంద్రాలుగా రూపొందాయి.

కడప కేంద్రానికి మదనపల్లెకి చెందిన టి.ఆర్.రెడ్డిని అసిస్టెంట్ స్టేషన్ డైరక్టర్‌గా బదిలీ చేశారు. ఆయన బెంగుళూరువాసి. సౌజన్యమూర్తి. కార్యక్రమ నిర్వాహకులుగా బి.ఆర్. పంతులు, ఆర్. విశ్వనాథం బదిలీ మీద వచ్చారు. కేంద్ర ప్రసారాల ప్రారంభం జూన్‌లో జరిగింది. బహిరంగసభకు ముఖ్య అతిథిగా అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళాశిశుసంక్షేమశాఖా మంత్రిణి శ్రీమతి యం. లక్ష్మీదేవి విచ్చేశారు. ఆమె కడప ఆర్ అండ్ బి గెస్టు హవుస్‌లో బస చేశారు.

వారిని ఆహ్వానించడానికి టి. ఆర్. రెడ్డి ఆర్ అండ్ బి బంగాళాకు వెళ్ళారు. బయట అటూ ఇటూ పచార్లు చేస్తున్న ఒకరిని – "మంత్రిగారు లోపల ఉన్నారా?" అని ఆయన అడిగారు.

ఆమె చిరునవ్వు చిందిస్తూ – "నేనే. రండి లోపలికి" అని తీసుకువెళ్ళారు. ఈ రోజుల్లో వలె గన్‌మెన్లు, అంగరక్షకులు అవసరం లేని రాజకీయ వాతావరణం వున్న రోజులవి. సభ సజావుగా జరిగి ప్రసారాలు మొదలయ్యాయి. అప్పుడప్పుడే బాలారిష్టాల దశ దాటింది.

కడప కోపరేటివ్ కాలనీలోని రెండు అద్దె భవనాలలో ఆకాశవాణి ప్రారంభమైంది. ఒక భవనంలో స్టూడియో, స్టేషన్ ఇంజనీరు టి.ఏ.జి. కృష్ణన్ ఆఫీస్తు అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది ఆఫీసు ఉన్నాయి. రోడ్డుకటువైపు మరో భవనంలో మిద్దె మీద అసిస్టెంట్ డైరక్టరు, కింద రెండు గదులలో పంతులు, విశ్వనాథం తమ పరివారంతో కొలువు తీరారు.

నేను చేరిన రోజు ఏ గదీ ఖాళీ లేదు. వంటగదిని కొద్ది మార్పులు చేసి నన్ను కూచొని కార్యక్రమాలు వండమన్నారు. వంటకు నేను కొత్త. మిగిలిన ఇద్దరూ పదేళ్ళ అనుభవజ్ఞులు.

అనౌన్సర్లుగా ఆరవీటి శ్రీనివాసులు, గుర్రం కోటేశ్వరరావు, గోపి, రాజగోపాల్ నలుగురున్నారు. కోటేశ్వరరావు బి.ఎల్. కూడా చదివారు. ఆయన నేను వెళ్ళిన ప్రొడ్యూసర్ ఇంటర్వ్యూలో క్షతగాత్రుడు.

డ్యూటీ ఆఫీసర్లుగా కె.ఆర్. భూషణరావు, బి. జి.ఎస్. రావు, స్థానికుడైన సుండుపల్లి హనుమంతరావు పనిచేస్తున్నారు. రోజూ ఉదయం నాలుగు గంటలకే వీరంతా డ్యూటీల ప్రకారం 14 కిలోమీటర్ల దూరంలో వున్న కొప్పర్తికి ఆఫీసు కార్లో వెళ్ళేవారు. స్టూడియోలో రికార్డు చేసిన టేపులు అక్కడికి తీసుకెళ్ళి ప్లే చేసేవారు. హైదరాబాదు, ఢిల్లీల నుండి సమయోచితంగా వార్తలు – ఆంగ్లం, హిందీ తెలుగులలోనూ ఢిల్లీల నుండి రిలే చేసేవారు. ప్రాంతీయవార్తలు హైదరాబాదు నుంచి ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ప్రసారమయ్యేవి. తర్వాత కొంతకాలానికి విజయవాడలో ప్రాంతీయ వార్తావిభాగం ప్రారంభించారు.

ఇక్కడ ఒక సందేహం వస్తుంది. ఆకాశవాణి ట్రాన్స్‌మిటర్లు అన్ని చోట్లా ఊరికి 10–15 కిలోమీటర్ల దూరంలో ఎందుకుంటాయి? హైదరాబాదుకు సరూర్‌నగర్‌లో, విజయవాడకు మంగళగిరిలో, కడపకు కొప్పర్తిలో, విశాఖకు అగినంపూడిలో ఉన్నాయి. దీనికి కారణం – ట్రాన్స్‌మిటర్లకు 10 కిలోమీటర్ల దూరం వరకు ప్రసారాలు వినిపించవు. దానిని షాడో జోన్ – అంటారు. అందుకని ఊరికవతల కట్టారు.

నేను డ్యూటీలో చేరిన మూడో రోజున కడప రామకృష్ణమందిరం సమావేశపు హాల్‌లో 20 సూత్రాల ఆర్థికప్రణాళికమీద ఒక గోష్ఠి ఏర్పాటు చేశారు. అప్పట్లో ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధి ప్రకటించిన 20 సూత్రాల ప్రణాళిక ప్రచారబాధ్యతను ఆకాశవాణి కేంద్రాల కప్పగించారు. ప్రతీ నెలా ప్రతీ కేంద్రమూ ఒక స్టేట్‌మెంట్ ఢిల్లీకి పంపాలి. అక్కడ 20 సూత్రాల ప్రణాళికా ప్రచార సమీక్ష జరిగేది. మన తెలుగువారైన డా. యన్. భాస్కరరావు దాని పర్యవేక్షకులు.

స్టేషన్లు ప్రతీ నెలా కనీసపక్షం 50 కార్యక్రమాలు చేయాలని ఆంక్ష. సంఖ్యాబలం కోసం సినిమా పాటలలో ఎక్కడో ఒక పదం వచ్చినా దానిని స్టేట్‌మెంట్లో చూపేవారు. 'వెల్‌డన్' అని ప్రశంసలందుకొనేవాళ్ళం. ఈ నేపథ్యంలో కడపలో జరిగే ఆ కార్యక్రమాన్ని రికార్డింగ్ చేసే బాధ్యత నా మీద పెట్టారు. ఆ రోజు రాత్రి పదిగంటలకు రేడియో నివేదిక నేను తయారు చేయాలి. నాకు సహాయకుడిగా ఆరవేటి శ్రీనివాసులు అనౌన్సర్ వచ్చాడు. దాదాపు ఆ రాత్రి ఎనిమిది గంటల సమయం వరకూ సభ జరిగింది. అందులో కాంగ్రెసు, కమ్యూనిస్టు పార్టీలకు చెందినవారు, జిల్లా కలెక్టరు పాల్గొన్నారు. ఆఫీసుకొచ్చి 8.30 నుండి 9.30 వరకూ నివేదిక తయారు చేశాం. మధ్య మధ్యలో వ్యాఖ్యానం నేను తొలిసారిగా చేసే అవకాశం వచ్చిందని సంతోషించాను. కానీ... ఆదిలోనే హంసపాదు అన్నట్టు ఓ సంఘటన జరిగింది.

నేను, శ్రీనివాసులు మధ్య మధ్య లింకింగ్ సంభాషణలు వ్రాస్తున్నాము. "కడప రామకృష్ణ మందిరంలో ఈ సాయంకాలం 20 సూత్రాల ఆర్థికప్రణాళికపై సభ జరిగింది. అధ్యక్షులుగా జిల్లా కలెక్టరు పి.యల్. సంజీవరెడ్డి వ్యవహరించారు". సంజీవరెడ్డి గొంతు వినిపించాలి. చివరగా మాట్లాడిన కమ్యూనిస్టు పార్టీకి చెందిన యన్. శివరామిరెడ్డి గూర్చి వ్రాయాలి. ఆరవీటి శ్రీనివాసులు నాకో సలహా ఇచ్చాడు.

"సార్! కమ్యూనిస్టు పార్టీ పేరు మనం చెప్పకూడదు, కేవలం యన్. శివరామిరెడ్డి అని చెప్పండి" అన్నాడు.

ఈ పరిభాషలో ఏ, బి, సి, డి. లు కూడా తెలియని నేను ఆయన మాటను వేదవాక్కుగా భావించి అలానే రికార్డు చేశాం. మర్నాడు నిత్యం జరిగే ప్రోగ్రాం మీటింగ్‌లో టి.ఆర్. రెడ్డి నా గొంతు రేడియోకి సరిపోతుందని మెచ్చుకొన్నారు.

అయితే ఆ కథ అంతటితో ఆగలేదు. వారం రోజుల్లో ఢిల్లీ నుండి ఒక తాఖీదు వచ్చింది. కడప పార్లమెంటు సభ్యులు, కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు, నిజాయితీకి మారుపేరు అయిన ఎద్దుల ఈశ్వరరెడ్డి ఆకాశవాణి డైరక్టర్ జనరల్ కార్యాలయానికి ఓ కంప్లయింట్ చేశారు. కమ్యూనిస్టు పార్టీ పేరును ప్రస్తావించకపోవడం దురుద్దేశపూర్వకమని వ్రాశారు. దానికి నా సంజాయిషీ మౌఖికంగా అడిగారు. నేను శ్రీనివాసులు అలా అన్నాడని చెప్పక తప్పలేదు. మొత్తానికి కేంద్రం నుండి తగిన రీతిలో సమాధానం పంపారు. ఆ ఉపాఖ్యానం ముగిసింది.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Akasavani+Parimalalu**

* * *